క్లుప్తంగా

సేవలు మరువలేనివి



నావికా దినోత్సవంలో పాల్గొన్న కాకినాడ సీపోర్టు ఆఫీసర్ శ్రీధర్మశాస్త, రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: సముద్ర మార్గం ద్వారా అంతర్జాతీయ జలరవాణాకు నావికులు అందిస్తున్న సేవలు మరువలేనివని కాకినాడ సీపోర్టు ఆఫీసర్ కె.శ్రీధర్మశాస్త తెలిపారు. ఏపీ మారిటైం బోర్డు, ది కంపెనీ ఆఫ్ మాస్టర్స్ మెరైనర్స్ ఆఫ్ ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నావికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎగుమతిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సురక్షంగా ఇతర దేశాలకు సరుకు రవాణా చేయడంలో నావికులు పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం పోర్టు ఆఫీసర్ శ్రీధర్మశాస్త, సీపోర్టు జనరల్ మేనేజర్ ఎం.జాకబ్ సత్యనారాయణను క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎంవీ సుబ్రహ్మణ్యం, సభ్యులు కేవీఎస్ సీతారాం, వి.నగధర్, వి.శ్రీనివాస్, ఎం.దుర్గామహేష్ పాల్గొన్నారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకుంటున్న రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌కు 12 ప్రతిష్టాత్మక అవార్డులను రోటరీ గవర్నర్ భాస్కర రామ్ అందించారు. సోమవారం విజయనగరం రోటరీ క్లబ్‌లో డిస్ట్రిక్ట్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌కు ఉత్తమ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్, ఉత్తమ కార్యదర్శిగా వడ్డాది ఆదిత్యలకు ప్రత్యేక వ్యక్తిగత అవార్డు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధులను సమీకరించినందుకు క్లబ్ సభ్యుడు కృష్ణప్రకాష్ మరో అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ రోటరీకి అధికంగా నిధులు అందజేసినందుకు రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావుకు ప్రత్యేక అవార్డు దక్కింది. పాల్‌హారిస్ పేరిట విరాళాలు అందజేసినందుకు ప్రత్యేక అవార్డు, రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో అత్యాధునిక పరికరాల ఏర్పాటుకు కృషి చేసినందుకు నావెల్ ప్రాజెక్టుగా గుర్తించి ప్రత్యేక అవార్డును అందజేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావుకు ప్రత్యేక అప్రిషియేషన్ అవార్డులు అందించారు.

ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం



సర్పవరం పంచాయతీ భావనారాయణపురంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులు

కాకినాడ రూరల్: సర్పవరం పంచాయతీ పరిధి భావనారాయణపురంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. భావనారాయణపురం గ్రామస్తులకు ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా నీటిని అందించేందుకు జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.63.36 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శంకుస్థాపన చేశారు. 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు పనులను ప్రారంభించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారుతిరామ్ తెలిపారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



రమణయ్యపేట వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సువర్ణరాజు

కాకినాడ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు సువర్ణరాజు సూచించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం సువర్ణరాజు మాట్లాడుతూ ఇంట్లో దుమ్మూ ధూళి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. బయట ఆహార పదార్థాలపై ఈగలు ఎక్కువగా వాలడం వల్ల బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకూ ఇంట్లో ఆహార పదార్థాలను ఆరగించాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

వావ్.. బాగుందోచ్

- యువత చూపు స్మార్ట్ వాచ్‌ల వైపు
- కొత్త ఫీచర్లతో ప్రయోజనాలు

బోట్‌క్లబ్: కాలం మారింది.. ఇట్స్ మై టైమ్ అంటూ లేటెస్ట్ ట్రెండ్ దూసుకు వచ్చింది.. ఒకప్పుడు వాచ్ అంటే టైమ్ చూడటానికో, తేదీ తెలుసుకోవడానికో వాడేవారు. కానీ నేడు స్మార్ట్‌వాచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో సెల్‌ఫోన్‌లో ఉపయోగించే ఫీచర్లతో పాటు పల్స్ రేట్, తదితరాలు ఇమిడిపోయాయి. అందుకే వీటి కొనుగోలుకు నగరంలోని యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కాకినాడ నగరంలో సుమారు 130 దుకాణాల్లో స్మార్ట్‌వాచ్‌లు విక్రయిస్తున్నారు. ఒక్కో దుకాణంలో ప్రతి రోజూ మూడు నుంచి 4 వాచ్‌లు అమ్ముడవుతున్నాయి.



వివిధ రకాల స్మార్ట్‌వాచ్‌లు

నగరంలో సుమారు 20కి పైగా పెద్ద షోరూమ్‌లు ఉన్నాయి. వాటిలో 10 నుంచి 20 వాచ్‌లు విక్రయిస్తున్నారు. మగవారితో పోటీపడి మరీ ఆడవాళ్లు స్మార్ట్‌వాచ్‌లు కొనుగోలు చేస్తున్నారని విక్రయదారులు చెబుతున్నారు.



ప్రస్తుతం మార్కెట్‌లో రూ.వెయ్యి నుంచి రూ.లక్ష విలువైన స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రముఖ కంపెనీలన్నీ స్మార్ట్ వాచీల తయారీలో పోటీ పడుతున్నాయి. స్మార్ట్ ఫోన్ల మాదిరిగానే వాచ్‌లు కూడా కొత్త ట్రెండ్‌కు అనుగుణంగా వస్తున్నాయి. ఈ వాచ్‌లో మనం చేసే రోజువారీ పనులు కూడా సులభతరం చేసే అనేక ఫీచర్లు ఉంటున్నాయి. అధునాతన కెమెరా, సిమ్‌కార్డ్ ఆప్షన్లు కూడా కలిగి ఉంటున్నాయి. కాకినాడలో సెల్‌ఫోన్ విక్రయించే ప్రతి దుకాణంలోనూ ఈ స్మార్ట్ వాచ్‌లు విక్రయిస్తున్నారు.

ఎన్నో.. మరెన్నో..

స్మార్ట్ వాచ్‌లో ఎన్నో కొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానమైంది బ్లూటూత్ ఆప్షన్. దీనిని ఉపయోగించి ఫోన్ కాల్స్‌ను వాచ్ ద్వారా స్వీకరించవచ్చు. డయల్ కూడా చేయవచ్చు. మెసేజ్‌లు కూడా పంపించవచ్చు. ఇది అనేక రకాలుగా ఉపయోగపడుతోంది. నేటి కాలంలో చాలా మంది రోజంతా కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేయాల్సి ఉంటుంది. అలాంటి సమయాల్లో మన ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. స్మార్ట్ వాచ్‌లు ఉంటే మన కార్యాచరణ సులభమవుతుంది. నిద్ర, మంచినీరు తాగడం, ఎక్కువ సేపు కూర్చుని ఉంటే నిలబడాలని సూచించడం వంటి విలువైన అంశాలను ఇవి అందిస్తున్నాయి. మనం ఏ సమయానికి ఏం చేయాలో కూడా తెలియజేస్తున్నాయి. శరీర ఉష్ణోగ్రత, హృదయ స్పందన రేటును చెప్పే ఆప్షన్లు వీటిలో అందుబాటులో ఉంటున్నాయి.



నగరంలోని ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్మార్ట్‌వాచ్‌లు

మెరుగైన వ్యాయామానికి..

మెరుగైన వ్యాయామం చేసేందుకు ఈ స్మార్ట్ వాచ్‌లు దోహదపడుతున్నాయి. ఫిట్‌నెస్ లక్ష్యాలను పర్యవేక్షించడం, ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. హార్ట్ బీట్ నోటిఫికేషన్ వినియోగదారులకు వ్యాయామం చేస్తున్నప్పుడు తమను తాము ఎక్కువ శ్రమించడంపై హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రతి రోజూ ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నారో తెలుపుతుంది. ఇది యువతను ఎంతో ఆకర్షిస్తోంది. అందుకే వీటి వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది.

ఎంతో ఉపయోగం



మా నాన్న పుట్టిన రోజు గిఫ్ట్‌గా నాకు స్మార్ట్ వాచ్ ఇచ్చారు. ప్రతి రోజూ నేను ఎన్ని అడుగులు వేస్తున్నాను. ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నానో ఈ వాచ్‌లో తెలుస్తుంది. వాచ్‌లో ఎన్నో ఫీచర్లు ఉన్నాయి. ఇవి బాగా ఉపయోగపడుతున్నాయి. ఇది కొత్త ట్రెండ్‌కు ఆవిష్కరణే.

–ఆకుల అభిషేక్ రాహుల్, విద్యార్థి

2న స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జూలై 2న జిల్లా స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి ఐ.రాజు సోమవారం తెలిపారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలలో పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకూ ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారు గుంటూరు జిల్లా నరసారావుపేటలో వచ్చే నెల 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 92466 90466 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

వచ్చే నెల 2న శెట్టిబలిజల ఆత్మీయ కలయిక

కాకినాడ సిటీ: వచ్చే నెల 2న కాకినాడ రామారావుపేట శెట్టిబలిజ కల్యాణ మండపంలో శెట్టిబలిజల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా నాయకులు చొల్లంగి వేణుగోపాల్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రామారావుపేటలోని శెట్టిబలిజ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు శెట్టిబలిజలకు సంఖ్యాపరంగా సీట్లు కేటాయించాలన్నారు. దీనికిగాను శెట్టిబలిజలను ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఆత్మీయ కలయికలో తాము ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శెట్టిబలిజ సంఘ నాయకులు ఎల్లబోయిన చిన్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధికి సహకారం



అసోసియేషన్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: స్థానికంగా వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేందుకు ఎల్‌బీఎస్ సంస్థ ఎంతగానో సహకరిస్తుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం ఎల్‌బీఎస్ సంస్థ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో వ్యాపారులంతా సభ్యులుగా చేరి వారి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అసోసియేషన్ లోగోను సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఎల్‌బీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకుర్ సురాన, ఉపాధ్యక్షుడు తేజ, సెక్రటరీ విజయ్‌జైన్, జాయింట్ సెక్రటరీ సిరాజ్, ట్రెజరర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



చైతన్య ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



సర్పవరం జంక్షన్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఏసుబాబు

కాకినాడ క్రైం: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ, సెబ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి భానుగుడి కూడలి వరకూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత భవితను విచ్ఛిన్నం చేస్తున్నాయన్నారు. కొందరు తమ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను సైతం చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, అలవాట్లపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా పోలీస్ శాఖ పరిధిలో సెబ్ విశేష సేవలందిస్తోందని కొనియాడారు. ప్రత్యేక అధికారి ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో సెబ్ బృందం గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి హాని

కాకినాడ రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని న్యాయవాది ఏసుబాబు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. శరీరక, మానసిక ఆరోగ్యానికి హాని కలిగించడమే కాకుండా తీవ్రమైన భావోద్వేగాలకు గురి చేస్తుందన్నారు. ఈ విష సంస్కృతిని పారద్రోలాలన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా టోల్ ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రిస్టియన్ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగం క్రిస్టియన్ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన జగ్గంపేటకు చెందిన జాన్ వెస్లీ సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీని కండువాతో కన్నబాబు సత్కరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పని చేయాలని సూచించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి జగన్మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తామన్నారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గుర్రం జాషువా గిరి, విలియమ్స్ చర్చ్ స్టీఫెన్ ఆనంద్, రాజారత్నం, కుమార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా 'జగనన్న సురక్ష'

- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్
- క్షేత్రస్థాయిలో పరిశీలన



జగనన్న సురక్ష కార్యక్రమంపై యాప్‌లలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్ట ప్రణాళికతో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సూచించారు. జూలై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకంపై జరుగుతున్న సమాచార సేకరణ ప్రక్రియను ఆయన సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 1, 8, 15, 22, 29, 43 సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి యాప్‌లో కుటుంబాల సమాచారాన్ని నమోదు చేస్తున్న తీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందికి కమిషనర్ పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి అక్కడి కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో పారదర్శకంగా నమోదు చేపట్టాలని సూచించారు. అనంతరం సచివాలయాలను కూడా సందర్శించారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ సీతాపతి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అర్హులకు అవకాశం



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ

కాకినాడ సిటీ: ప్రభుత్వ పథకాలకు అర్హులు మిగిలి ఉంటే గుర్తించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఓ మంచి అవకాశమని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష అవగాహన సమావేశాలకు సంబంధించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో సన్నాహక సమావేశం నిర్వహించి జూలై 1వ తేదీ నుంచి అర్హులకు పథకాలు, సర్టిఫికెట్లు అందజేయాలని ఆర్డీఓ ఆదేశించారు. అదే విధంగా ఇతర రెవెన్యూ అంశాలైన జగనన్నకు చెబుదాం, రీసర్వే, స్పందన దరఖాస్తులపై మాట్లాడారు. పరిపాలన అధికారి జి.వరహాలయ్య, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఆరుగురి ఎంపిక



ఉద్యోగావకాశాలు కల్పించినందుకు కలెక్టర్ కృతికా శుక్లాకు కృతజ్ఞతలు తెలుపుతున్న అభ్యర్థులు

కాకినాడ సిటీ: ఇటీవల స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఉద్యోగాల కోసం పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఆరుగురు అభ్యర్థులు వికాస ద్వారా వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు సోమవారం స్థానిక స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో బి.ధనలక్ష్మి, ఎస్.ప్రేమాంజలి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నెలకు రూ.17 వేల జీతంతో ఎంపికయ్యారు. జియో ఫైబర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జి.మనోజ్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నెలకు రూ.17 వేల జీతంతో ఎంపికవ్వగా, జె.బాలరాజు, సీహెచ్ సాయికిరణ్‌లు నెలకు రూ.16,500లతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు సాధించారు. అదేవిధంగా ఎంఎంఎస్ఎస్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో సీహెచ్ మురళీకృష్ణకు నెలకు రూ.11 వేల జీతంతో వాచ్‌మెన్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



స్పందనలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడ కార్పొరేషన్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఫోన్ ద్వారా వచ్చిన సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రజా సమస్యలపై 13 మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలియజేశారని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డీఈలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. 11 మంది వివిధ సమస్యలపై కమిషనర్‌కు విజ్ఞప్తులు అందజేశారు. ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించండి

కరప: ఉపాధి హామీ పథకంలో కూలీలకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఇతర సమస్యలనూ పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కరప మండల కమిటీ కోరింది. ఈ మేరకు స్థానిక మండల స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పారావుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు చోడిశెట్టి కృష్ణ, పొట్లకాయల కృష్ణ, మందనక్క జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరా.. సర్వేశ్వరా..



ప్రత్యేక అలంకరణలో మహిషాసుర మర్దిని అమ్మవారు

సామర్లకోట: చల్లగ చూడు భీమేశ్వరా అంటూ భక్తజనం ఆ స్వామివారిని మనసారా కొలిచింది.. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులు కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యుడు, దేవదాయ శాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. క్షేత్రంలో వేంచేసి ఉన్న మహిషాసుర మర్దిని ఆలయంలో ఆషాఢ మాసం అష్టమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధి రాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు.

ఒకటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయానికి రంగులు, విద్యుత్తు దీపాలంకరణ పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం మేలుకొలుపు హారతి, అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద బాలికలచే పాటలు, కోలాట ప్రదర్శన, 3.30 గంటలకు ఆలయం నుంచి బాబావారి పల్లకి, వాహన ఉత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. 3న గురుపూర్ణిమ సందర్భంగా తెల్లవారు జామున మేలుకొలుపు హారతి, బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు చేస్తారు.

విద్యా సమస్యలపై ధర్నా

కాకినాడ సిటీ: విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు వరహాలు, దినేష్‌కుమార్, శ్రీకాంత్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలంటూ..

కాకినాడ కలెక్టరేట్ వద్ద రౌతులపూడి మండలం పారుపాక కోడూరు ఎస్.అగ్రహారం పల్లపు చామరం దళితులు ధర్నా చేశారు. పారుపాక పంచాయతీలో 28 ఎకరాలను దళితులు సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రేచుకట్ల సింహాచలం, ఆవాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పలు విత్తన దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం వ్యవసాయ శాఖ డీడీ బీవీఎస్ హరి, పెద్దాపురం, తుని, గొల్లప్రోలు మండలాల వ్యవసాయ శాఖాధికారులు కె.సంజీవ్ కుమార్, అశోక్, కేవీవీ సత్యనారాయణ తదితరులు చేబ్రోలులోని సాయికృష్ణ ఏజెన్సీస్, సాయి దేవి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. సాయి కృష్ణ ఏజెన్సీస్‌లో రికార్డులకు, స్టాక్‌కు తేడాలు ఉండడంతో రూ.2,17,500 విలువైన 235 ప్యాకెట్ల విత్తనాల అమ్మకాలను నిలుదల చేశారు. పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సామర్లకోట: వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి తెలిపారు. సోమవారం స్థానిక గాంధీచౌక్ రైతు భవనంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆటో, లారీ, కార్లను నడిపే సమయంలో డ్రైవర్లు తమ కుటుంబాన్ని గుర్తు చేసుకుని బాధ్యతగా వెళ్లాలన్నారు. అతివేగం కారణంగానే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇచ్చి నేరాలను అదుపు చేయడానికి ఆటో డ్రైవర్లు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ప్రతి వాహనంలో డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, బీమా పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోడ్రైవర్ల పిల్లల చదువుకు సంబంధించి తన వంతు సహాయం అందజేస్తానని ఆమె హామీ ఇచ్చారు. సీఐ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటో ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతున్నారని, ఇటువంటి సంఘటనల నివారణకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశానికి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అధ్యక్షత వహించగా ఏఎస్సై రత్నం, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్, ఆటో యూనియన్, ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.